పెండింగ్ వేతనాలను చెల్లించాలి

ర్యాలీ చేపడుతున్న గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21 : జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు అన్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని మర్రికుంట నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికులకు ఆరునెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, వేతనాలు రాకపోవడంతో గ్రామ పంచాయతీ కార్మికులు అప్పులు చేసి కుటుంబాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఉద్యోగులు లాగా ప్రతినెలా 1వతేదీనే కార్మికులకు వేతనాలు వచ్చే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. కార్మికులకు ప్రధాన ఆటంకంగా ఉన్న మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలన్నారు. కార్మికులకు అందించే వస్తువులు రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే ఇవ్వాలని పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్దఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, సహాయ కార్యదర్శి రమేశ్, నాయకులు నందిమల్ల రాములు, మధు, పుష్ప, హనీఫ్, అక్తర్‌పాషా, దాసు, శ్రీను, నారాయణ, కాశయ్య, వెంకటేశ్, భాస్కర్, అజిత్, చెన్నమ్మ, రామచంద్రయ్య, పెంటయ్య, సుగ్రీవుడు, ఖాదర్, మధు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పేరు తేవాలి

- **వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి**

బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబడుతున్న వనపర్తి కలెక్టర్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21 : పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాల, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆకాంక్షించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి నాణ్యమైన భోజనం మాత్రమే అందించాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు చదువుకోవడానికి అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నదని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులకు గణితంపై కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్స్‌ను అందజేశారు. అదేవిధంగా పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న వంటగది నిర్మాణానికి సంబంధించి ఈడబ్ల్యూడీసీ ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. పాఠశాలలో ఉన్న పెండింగ్ పనుల పూర్తి చేయడానికి అంచనాల నివేదికను అందజేయాలని ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. స్థానిక కేడీఆర్ నగర్‌లోని ప్రత్యేక అవసరాల బాల బాలికల జిల్లా వనరుల కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి సెంటర్‌లో ఉన్న చిన్నారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రత్యేక అవసరాల పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి కావాల్సిన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని భవిత కేంద్రాలకు స్పీచ్ థెరపీకి సంబంధించి పరికరాలు అందజేస్తానని కలెక్టర్ చెప్పారు.

కార్యక్రమంలో విద్యా శాఖ అధికారులు యుగంధర్, శేఖర్, బాలికల పాఠశాల హెచ్ఎం ఉమాదేవి, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

వనపర్తి జిల్లా కేంద్రంలోని పాత బజారులోని వీరాంజనేయస్వామి ప్రతిష్ఠాపనోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, సతీమణి వాసంతి

పౌష్టికాహారంతో విద్యార్థుల చదువులకు దోహదం

మాట్లాడుతున్న ఇన్‌చార్జి డీఈవో

- **ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని**

గట్టు, ఫిబ్రవరి 21 : బలమైన పౌష్టికాహారం విద్యార్థుల చదువులకు దోహదపడుతుందని ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని అన్నారు. కలెక్టర్ సూచనల మేరకు ఇన్‌స్పైర్, అన్నపూర్ణ ట్రస్ట్ వారి సాయంతో స్థానిక జెడ్పీహైస్కూల్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు రాగి చిక్కిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు శారీర దారుఢ్యం ముఖ్యమన్నారు. బలమైన ఆహారం తీసుకున్నప్పుడే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పైర్ కోఆర్డినేటర్ ఇనాయిష్, అన్నపూర్ణ ట్రస్ట్ కోఆర్డినేటర్ ఆనంద్, ఎంపీడీవో చెన్నయ్య, ఎంఈవో నల్లారెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సత్యకళ, హెచ్ఎం ఆగస్టిన్, ఉపాధ్యాయులు నర్సింహులుగౌడ్, రమేశ్, కృష్ణమూర్తి, వెంకటేశ్, సుజాత పాల్గొన్నారు.

గిరిజనులకు ఉచిత న్యాయ సేవలు



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి

పెద్దమందడి, ఫిబ్రవరి 21 : గిరిజనులకు ఉచిత న్యాయసేవలు కల్పిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి వి.రజిని అన్నారు. శుక్రవారం మండలంలోని చీకర్‌చెట్టుతండాలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గిరిజనులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గిరిజనులతో పాటు ఎస్సీలు, మహిళలు, పిల్లలకు, వయోవృద్ధులకు ఉచితన్యాయ సేవాలు కల్పిస్తున్నామన్నారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం సైకియాట్రిస్ట్ డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిని భూత వైద్యుల వద్దకు తీసుకెళ్లరాదని జిల్లా ప్రభుత్వ దవాఖానలో ఉన్న మానసిక వైద్య నిపుణుల వద్దకు తీసుకొచ్చి కౌన్సిలింగ్ ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉత్తరయ్య, సఖి లీగల్ కౌన్సిల్ కృష్ణయ్య, పారా లీగల్ వలంటీర్ అహ్మద్, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ప్రీతి సుధ, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి


చికిత్స పొందుతున్న కార్మికురాలు సుజాత

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21: వనపర్తి జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు శ్రీరాం , పట్టణ కార్యదర్శి రమేశ్ డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్‌గా పనిచేస్తున్న మహిళా కార్మికులను పనిచేయడం లేదని నిందలు వేసి విధులకు రానివ్వడం లేదన్నారు. విధులకు వస్తామని ప్రాధేయపడిన కనికరించలేదన్నారు. దవాఖాన గేటు వద్ద ఎండలోనే కార్మికులు వేచిచూశారని, ఎండ తీవ్రతకు స్పృహ తప్పి పడిపోగా అంబులెన్స్‌లో ప్రభుత్వ దవాఖానకు తరలించారని, ప్రిన్సిపాల్ నిందలు భరించలేకపోతున్నామని వారు కన్నీరుమున్నిరవుతున్నారన్నారు. తక్షణమే ఐదుగురిని విధుల్లోకి తీసుకోవాలని, ప్రిన్సిపాల్ వేధింపులపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

పెబ్బేరులో స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

పెబ్బేరు, ఫిబ్రవరి 21: పట్టణంలో ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటివిద్యార్థులకు పాఠాలు బోధించారు. బోధనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు అవగాహన సదస్సు


మాట్లాడుతున్న సైంటిస్టు, డాక్టర్లు

రాజోళి, ఫిబ్రవరి 21 : చేనేత కార్మికుల అభివృద్ధి కోసం అందించే రాయితీ పథకాలపై, రంగుల అద్దకంపై కార్మికులు అవగాహన కలిగి ఉండాలని సైంటిస్టులు డాక్టర్ శ్రీనివాస్, నవీన్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం చేనేత కార్మికులకు కేంద్ర అందజేస్తున్న రాయితీ పథకాలు, రంగుల అద్దకంపై కార్మికుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గద్వాల్ పట్టు చీరలకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉందన్నారు. అనంతరం సైంటిస్ట్ దీపక్‌చౌదరి మాట్లాడారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ అశోక్ దేశాయ్, లోకేశ్, సంఘం అధ్యక్షుడు శ్రీను, దస్తగిరి, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

ప్రతిపాదనలు తయారు చేయాలి

పెద్దమందడి, ఫిబ్రవరి 21 : ఉద్యాన కళాశాల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు తయారుచేయాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని మోజర్ల ఉద్యాన కళాశాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్‌యార్డు అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, కళాశాల అసోసియేట్ డీన్ సైదయ్య, అధ్యాపకులు జడల శంకరస్వామి, జే.శ్రీనివాసులు, షహనాజ్, పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21 : మైనార్టీ గురుకుల పాఠశాలలో 5 నుంచి 8 తరగతులు, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి అఫ్జలుద్దీన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 5–8తరగతులలో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ, ఇంటర్ ఫస్టియర్‌లో మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు ఉంటాయని చెప్పారు. మైనార్టీ విద్యార్థులకు 75శాతం సీట్లు, నాన్ మైనార్టీకి 25శాతం సీట్లు కేటాయిస్తారని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక ఏప్రిల్ 24 నుంచి 30వ తేదీ వరకు , ఇంటర్ ప్రవేశాలకు మే 1 నుంచి 10 వరకు ఎంపికలు ఉంటాయని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని వారికి రూ.1.50లక్ష ఆదాయం, పట్టణ ప్రాంతాల వారికి రూ.2లక్షల ఆదాయం కలిగి ఉండాలని సూచించారు.

వ్యక్తి రిమాండ్

పెబ్బేరు,ఫిబ్రవరి 21 : వృద్ధురాలిపై అత్యాచార యత్నం చేసిన వ్యక్తికి న్యాయస్థానం 14రోజుల రిమాండ్ విధించినట్లు పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చెలిమిల్ల గ్రామానికి చెందిన మహిళకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి యత్నించిన పెబ్బేరుకు చెందిన ఎరుకలి రాముడుని అరెస్టు చేసి వనపర్తి జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచినట్లు ఆయన చెప్పారు. దీంతో ఆయనను మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

15శాతం నిధులు కేటాయించాలి

గట్టు, ఫిబ్రవరి 21 : విద్యాభివృద్ధికి రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో 15శాతం నిధులు కేటాయించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక(సీఆర్‌పీఎఫ్) డిమాండ్ చేసింది. గట్టులో బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండలస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణతో సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రాన్ని పంపించనున్నట్లు బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండల కన్వీనర్ నరేశ్ తెలిపారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

- **గద్వాల కలెక్టర్ సంతోష్**

గద్వాల, ఫిబ్రవరి 21 : జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇంటర్, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, రవాణ, వైద్య, ఆరోగ్య, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులతో ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 5 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు అధికారులు పూర్తి చేయాలని ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 14పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని అందులో 8,341మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు 4,057, సెకండియర్ విద్యార్థులు 4,284మంది ఉన్నట్లు తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాస్‌రా వు, డీఎస్పీ మొగులయ్య, ఇంటర్ నోడల్ అధికారి హృదయరాజు,అధికారులు రమేశ్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, అయూబ్, వైద్యాధికారి సిద్ధప్ప పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ అందించాలి

గద్వాల, ఫిబ్రవరి 21 : ప్రస్తుత యాసంగి సీజన్, రానున్న వేసవిలో జిల్లాలో నాణ్యమైన నిరంతరవిద్యుత్ సరఫరా అందించేందుకు అసవరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జూరాల జనరేషన్ ప్లాంట్ 220/132 కేవీ జూరాల సబ్‌స్టేషన్ 132/33కేవీ, 33/11కేవీ గద్వాల సబ్‌స్టేషన్ మానిటరింగ్ సెల్‌లను కలెక్టర్ తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. సమావేశంలో విద్యుత్‌శాఖ అధికారులు తిరుపతిరావు, రమేశ్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలి

పదో తరగతి చదువు మధ్యలో మానేసిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పోస్‌యాక్ట్ 2013పై జిల్లా స్థాయి అవగాహన సదస్సు, జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ విజయవంతంగా కొనసాగుతుందని దీని అమలు మరింత మెరుగుపరిచేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బాలకార్మికుల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేలా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలన్నారు కార్యక్రమంలో అదనపు కలెకర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డీఎస్పీ మొగులయ్య, అధికారులు సునంద, సిద్ధప్ప, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న యాదయ్య

అదనపు కలెక్టర్‌గా యాదయ్య బాధ్యతలు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21 : వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా జెడ్పీసీఈవో యాదయ్య అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు జిల్లా స్థానిక సంస్థల కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సంచిత్ గంగ్వార్ నారాయణపేట జిల్లాకు బదిలీ అయిన నేపథ్యంలో జెడ్పీసీఈవో యాదయ్యకు వనపర్తి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఉత్తర్వులు జారీచేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం యాదయ్య కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కలిశారు.

క్రీడలను ప్రోత్సహించాలి

- **ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి**

కొత్తకోట, ఫిబ్రవరి21 : గ్రామీణ స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. కొత్తకోటలో వారంరోజులుగా కొనసాగిన కేపీఎల్ క్రికెట్ పోటీలు శుక్రవారంతో ముగిసాయి. ఫైనల్‌లో శివ డిజిటల్స్, ఆర్ఆర్ఆర్ జట్లు పోటీపడగా శివ డిజిటల్స్ విన్నర్‌గా, ఆర్ఆర్ఆర్ జట్టు రన్నర్‌గా నిలిచాయి. మొదటి విజేతకు మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి షీల్డ్‌తో పాటు రూ.లక్ష, రన్నర్‌కు రాహుల్ దవాఖాన నిర్వాహకులు డాక్టర్ హరిణ్‌రెడ్డి షీల్డ్‌తో పాటు రూ.50 వేలు విజేతలకు అందజేశారు.కార్యక్రమంలో మాజీ జెడ్పీవైస్‌చైర్మన్ వామన్ గౌడ్, ఎంపీపీ గుంత మౌనిక, మాజీ జెడ్పీటీసీ డాక్టర్ పీజే.బాబు, మార్కెట్ చైర్మన్ ప్రశాంత్, సీడీసీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21: జిల్లావ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ముగిశాయని ఇంటర్ విద్యాధికారి ఎర్ర అంజయ్య తెలిపారు. మూడు దశలలో జరిగిన పరీక్షల్లో మొదటి దశలో 95 శాతం, రెండో దశలో 95.56 శాతం, మూడో దశలో 96.87శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు. గైర్హాజరైన వారికి నాలుగోదశలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనరల్ విద్యార్థులు 36 మంది, ఒకేషనల్ విద్యార్థులు 114 మంది మొత్తం 150 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 3 నుంచి 21 వరకు ప్రాక్టికల్ పరీక్షలు కొనసాగాయని ఆయన తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గోపాల్‌పేట, ఫిబ్రవరి 21 : మండలంలోని బుద్ధారం గ్రామానికి చెందిన కావలి బాలకిష్టయ్య (50) అనారోగ్యంతో మృతి చెందగా, శుక్రవారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు శ్రావణ్‌కుమార్ రూ. 2వేల ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో కావలి కృష్ణయ్య, ఏశమోని శేఖర్, చిక్కొండ్ర లక్ష్మయ్య, రాచాల శ్రీనివాసులు గౌడ్, యాసయ్య, రాములు, దామోదర్ ఉన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

పెబ్బేరు, ఫిబ్రవరి 21: బాల్య వివాహాల నిర్మూలన సామాజిక బాధ్యత అని, దీనిని అరికట్టేందుకు అందరూ తమ వంతుగా కృషి చేయాలని పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో పుస్తకాలు, క్యాలెండర్లు, పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధి రాజశేఖర్, ఏఎస్సై శ్రీనివాసులు పాల్గొన్నారు.

నడకమార్గం తప్పించేందుకే సైకిళ్ల పంపిణీ

అయిజ, ఫిబ్రవరి 21 : మండలంలోని ఉప్పల క్యాంపు నుంచి ఉప్పల జెడ్పీహెచ్ఎస్‌కు కాలినడక వస్తున్న విద్యార్థులకు నడకమార్గం తప్పించేందుకే మండలంలోని సింధనూర్ గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త మూలగుండం శివరామకృష్ణ ప్రసాద్ సైకిళ్లను ఉచితంగా అందజేశారని ఎంఈవో రాములు, ఎస్సై శ్రీనివాసరావులు అన్నారు. శుక్రవారం కార్యక్రమంలో హెచ్ఎం బలరాం, మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కృపానందం, నాయకులు లక్ష్మన్న, లాల్‌గౌడ్, వీరబాబు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

వడ్డేపల్లి, ఫిబ్రవరి 21 : కలెక్టర్ సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు డీపీఆర్వో ఆరిపుద్దీన్ ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతిక సారథి కళాకారుల అధ్యక్షుడె మహ్మద్ రాహుల్ నేతృత్వంలో మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లో శుక్రవారం ఎండల తీవ్రతలో తీసుకోవాల్సి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రేలారే ప్రసాద్, కేశవులు, రమాదేవి పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోండి

అలంపూర్ చౌరస్తా, ఫిబవరి 21 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల మిర్చి రైతు కుదేలవుతున్నాడని రైతు సంఘం జిల్లా నాయకుడు ఈదన్న అన్నారు. శుక్రవారం మండలంలోని కంచుపాడు, ఉండవల్లి గ్రామాల్లో పండు మిర్చి రైతులకు గిట్టుబాటు ధరను కల్పించాలని నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా చట్టం చేసి పండు మిర్చి రైతులకు క్వింటాళ్లు రూ.25వేలు అందించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు శేషన్‌గౌడ్, రైతులు శాంతమ్మ, శ్రీనివాసులు, మహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి

సాహితీ వేత్తలకు సన్మానిస్తున్న శంకర్‌గౌడ్

పెబ్బేరు, ఫిబ్రవరి 21 : మాతృ భాష తల్లి పాల వంటిది ని తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పెబ్బేరు మండలం యాపర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషకు తమ వంతుగా సేవలందిస్తున్న సీనియర్ సాహితీ వేత్తలు కందూరు నారాయణరెడ్డి, సందాపురం బుచ్చయ్య, పాఠశాల భాషోపాధ్యాయులు శ్రీధర్, ఇందిరను ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిలో..

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 21 : మాతృభాషను పరిరక్షించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఅధికారులు శ్రీనివాస్, లక్ష్మి, దామోదర్‌రెడ్డి ఉన్నారు.

గద్వాలలో..

గద్వాలటౌన్, ఫిబ్రవరి 21 : తెలంగాణ తెలుగు ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో అంతర్జాతీయ తెలుగుభాష దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు క్విజ్‌పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీసీఈబీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ఎస్‌వో ఏస్తెరురాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో శ్రీనివాసగౌడ్, ప్రధానోపాధ్యాయుడు శివశంకర్, ఫోరం నాయకులు మహేందర్, భానుప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ చంద్రమోహన్, అధ్యాపకులు సురేందర్‌రెడ్డి, సత్యన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి ప్రతిభా పోటీలో ప్రతిభ

అయిజ, ఫిబ్రవరి 21 : మాతృభాషా దినోత్సవాన్ని పురష్కరించుకుని తెలంగాణ తెలుగు టీచర్స్ ఫోరం జిల్లాశాఖ శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాల భవన్‌లో నిర్వహించిన తెలుగు భాష ప్రతిభా పోటీలో అయిజ మండలం, ఉత్తనూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని పవిత్ర ప్రతిభ కనబర్చింది. జిల్లాస్థాయిలో జరిగిన పోటీలో ద్వితీయస్థానం సంపాదించిందని ఉపాధ్యాయుడు ప్రభాకర్ తెలిపారు.


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న ఇంటర్ జిల్లా విద్యాధికారి హృదయరాజు

గట్టు, ఫిబ్రవరి 21 : ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించాలని ఇంటర్ జిల్లా విద్యాధికారి హృదయరాజు ఆకా టంక్షించారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు ఫస్టియర్ విద్యార్థులు శుక్రవారం వీడ్కోలుసమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాస్ కేఎస్‌డీ రాజు, లెక్చరర్లు రాజగోపాల్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

బంపర్ ఆఫర్

- **ఎర్రవల్లిలో ఫ్రీగా చికెన్ బిర్యానీ**

ఎర్రవల్లి చౌరస్తా, ఫిబ్రవరి 21 : జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల కేంద్రంలోని మాలిక్ చికెన్ సెంటర్ నిర్వాహకులు బంపర్ ఆఫర్ ప్రకటించారు. ఫ్రీగా చికెన్ బిర్యానీ, బాయిల్ ఎగ్స్ ఇస్తామని దుకాణ యజమాని మాలిక్‌బాషా తెలిపాడు. ఏపీలోని పౌల్ట్రీఫామ్స్‌లో బర్డ్‌ఫ్లూ వస్తుందన్న వదంతులతో ప్రజలు భయపడుతున్నారని, ఈ నేపథ్యంలో చికెన్, ఎగ్స్ తినేందుకు జంకుతున్నారని ఆయనన్నాడు. కోడి మాంసం, గుడ్లను బాగా ఉడికించి తినడం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి ప్రమాదం ఉండదని ఆయనన్నాడు. పైగా చికెన్, గుడ్లల్లో ప్రొటీన్స్ పుష్కలంగా ఉంటాయని, దీంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారన్నాడు.

చికెన్‌పై అవగాహన కల్పించేందుకు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపాడు. కరోనా సమయంలోనూ తాము ఉచితంగా చికెన్, ఎగ్స్ అందించినట్లు గుర్తు చేశారు. షాప్ వద్దకు ఎంత మంది వచ్చినా అందరికీ చికెన్ బిర్యానీ అందిస్తామన్నాడు.

మొబైల్ ఫోన్ అప్పగింత

ధరూరు, ఫిబ్రవరి 21 : మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే ఈఎంఐ నెంబర్‌తో ఫిర్యాదు చేయాలని ఎస్సై కొండ శ్రీహరి తెలిపారు. మండలంలోని నెట్టెంపాడు గ్రామానికి చెందిన ఎల్లప్ప మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా, స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో నెంబర్‌ను ట్రేస్ చేసి ఫోన్‌ను రికవరీ చేసి ఎల్లప్పకు ఎస్సై అప్పగించినట్లు తెలిపారు.

సమాధులను తవ్వివన వారిపై చర్యలు తీసుకోవాలి

అమరచింత, ఫిబ్రవరి 21: జేసీబీతో కాల్వను తవ్వే సమయంలో నిర్లక్ష్యంతో తమ పూర్వికుల సమాధులను తొలగించి మా మనోభాలను దెబ్బతీశారని, ఈ ఘటనకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని శుక్రవారం ముస్లిం మతపెద్దలు గాయోసిద్దీన్, ఎక్బుల్‌దీన్, ముస్సిపల్ మాజీ కౌన్సిలర్ మోసిన్ ఆత్మకూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని కర్షక రైల్ మిల్లు వద్ద గల ఈద్గా సమీపంలో మండలంలోని మోట్లంపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్ జేసీబీతో అక్రమంగా కాల్వ పనులు చేపడుతూ ముస్లిం కులస్తులు సీరాజ్‌ద్దీన్, ఖాజాపాషా తల్లిదండ్రుల సమాధులను తవ్వి వారి మనోభావలను దెబ్బతీశారన్నారు.